క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వివిధ పనులపై గురువారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జేపీ ఝాన్సీ బుధవారం తెలిపారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పనులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులపై జరిపిన సామాజిక తనిఖీ వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

ముత్యాలమ్మకు అష్టోత్తర కలశ స్థాపన



అమ్మవారికి అష్టోత్తర కలశ స్థాపన చేస్తున్న పురోహితులు

నల్లజర్ల: మండలంలోని చోడవరం గ్రామ దేవతైన ముత్యాలమ్మ వారి అష్టోత్తర కలశ స్థాపన ఉత్సవాల రెండో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర కలశ స్థాపన, గవ్యాంతం, వాస్తు పూజ, వాస్తు హోమం, చండీ పారాయణ జరిగాయి. సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, గీతాపారాయణం, సాయంత్రం చండీ హవనం చేసారు. భోగవల్లి శ్రీరామారావు, రాజ్యలక్ష్మి దంపతులు పూజాదికాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

10 నుంచి ప్రక్కిలంకలో సౌరయాగం పూజలు

తాళ్లపూడి: లోక కల్యాణార్థం ప్రక్కిలంక గ్రామంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఈ నెల 10 నుంచి 15వ సౌరయాగం పూజలు ప్రారంభం అవుతున్నాయి. శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో మార్చి 10 వరకూ నెల రోజుల పాటు రోజూ పలు రకాల పూజలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఆలయ అర్చకుడు కొతవరపు విశ్వనాథశర్మ మాట్లాడుతూ సూర్యుడు ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష కర్మ సాక్షి అన్నారు. ఈ నెల రోజులూ రోజూ గణపతి పూజ, దీక్షాధారణ, గోపూజ, సర్వదేవతా ఆవాహనం, సూర్య నమస్కారాలు, సౌరజపం, అభిషేకాలు, సౌర హోమం, గులాబీ, చామంతి, తులసీ దళాలతో పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 16న రథ సప్తమి సందర్భంగా ప్రక్కిలంకలో రథయాత్ర జరుగుతుందన్నారు. మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా లక్ష బిల్వార్చన, మార్చి 10న పూర్ణాహుతి, సూర్యనారాయణ మూర్తి శాంతి కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు.

హెల్త్ క్లినిక్‌లో ఆకస్మిక తనిఖీ



యాదవోలు హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీపీహెచ్ఎన్ వెంకటలక్ష్మి

దేవరపల్లి: మండలంలోని యాదవోలు ఆయుష్మాన్ మందిర్ (హెల్త్ క్లినిక్)ను బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. టీమ్ లీడర్, డీపీహెచ్ఎన్ జి.వెంకటలక్ష్మి, డీపీఓ కె.సంధ్యారెడ్డి, సీహెచ్ భాస్కర్, డీఎం రామకృష్ణలతో కూడిన బృందం ఈ తనిఖీలో పాల్గొన్నారు. గ్రామంలోని గర్భిణుల ఎంసీపీ కార్డులు, పిల్లల టీకాల రికార్డులను వారు పరిశీలించారు. 19 ఏళ్ల లోపు వారికి, గర్భిణులకు రక్త పరీక్షలు (హెచ్‌బీ) నిర్వహించి పాత రికార్డులతో పోల్చిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ హరిచంద్ర, డాక్టర్ ప్రశాంత్, సీహెచ్‌ఓ డి.సుజాత, హెచ్‌సీ నాగరాజు, హెచ్‌వీ ఈ. పద్మకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సారా, మద్యం, బీరు సీసాల స్వాధీనం

దేవరపల్లి: గోపాలపురం మండలం వేళ్లచింతల గూడేనికి చెందిన పాల వెంకటకృష్ణ అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 22 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి తెలిపారు. అలాగే జగన్నాథపురం గ్రామంలో నేతల నల్ల అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 12 బీరు సీసాలు, 3 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

పెరవలి: ఉసులుమర్రు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న సాంబశివరామ్ అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు నిడదవోలు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. అతడి వద్ద నుంచి తొమ్మిది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొవ్వలి శ్రీనివాసరావు అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ కొవ్వూరు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. అతడి వద్ద నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే సారా విక్రయిస్తున్న చాగల్లు మండలం చిక్కాల పాలేనికి చెందిన పెదపాటి బుజ్జి అనే మహిళను అరెస్ట్ చేసి, ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందుతులు ఇద్దరినీ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. అలాగే మద్దూరులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న అడబాల వీర నాగులు అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్టు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆసరా సాయం సంపూర్ణం

- అక్క చెల్లెమ్మలకు రూ.145.96 కోట్ల మేర లబ్ధి
- హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీ అమలు
- కొవ్వూరు నియోజకవర్గంలో 41,424 మందికి లబ్ధి
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి డ్వాక్రా మహిళల కృతజ్ఞతలు



కొవ్వూరులో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలకు హాజరైన డ్వాక్రా మహిళలు (ఫైల్)

కొవ్వూరు: డ్వాక్రా అక్కాచెల్లెమ్మల ఖాతాలకు డ్వాక్రా రుణ మాఫీ సొమ్మును నాలుగు విడతల్లో జమ చేస్తానని పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని పాదయాత్ర సమయంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆ మాట ప్రకారం డ్వాక్రా రుణ మాఫీ పథకాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారు. వైఎస్సార్ ఆసరా పేరుతో గడిచిన నాలుగేళ్ల నుంచి క్రమం తప్పకుండా మహిళల ఖాతాల్లోకి రుణ మాఫీ సొమ్ము జమ చేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదటి మూడు విడతల్లో కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోని 4,224 డ్వాక్రా సంఘాల సభ్యులైన 41,424 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.109.48 కోట్ల సొమ్మును ప్రభుత్వం జమ చేసింది. ఏకంగా నాలుగో విడతగా రూ.36.49 కోట్ల సొమ్మును ప్రభుత్వం జమ చేసింది.

మొత్తం నాలుగు విడతల్లో నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు రూ.145.96 కోట్ల మేర లబ్ధి పొందారు. చాగల్లు మండలంలో 12,365 మందికి రూ.44.52 కోట్లు, కొవ్వూరు మండలంలో 12,811 మందికి రూ.40.42 కోట్లు, తాళ్లపూడి మండలంలోని 19,768 మందికి రూ.43.47 కోట్లు, కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని 5,490 మంది మహిళలకు రూ.17.55 కోట్ల చొప్పున నాలుగు విడతల్లో రుణమాఫీ సొమ్ము మహిళల ఖాతాల్లోకి జమ అయ్యింది.

మండలం	సంఘాలు సంఖ్య	సభ్యుల సంఖ్య	మూడు విడతల్లో (రూ.కోట్లలో)	నాలుగో విడత (రూ.కోట్లలో)	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)
చాగల్లు	1,234	12,365	33.39	11.13	44.52
కొవ్వూరు	1,324	12,811	30.32	10.10	40.42
తాళ్లపూడి	1,117	19,758	32.61	10.87	43.47
కొవ్వూరు	549	5,490	13.16	4.39	17.65
మొత్తం	4,224	41,424	109.48	36.49	145.96

రూ.74 వేల రుణమాఫీ అయ్యింది



డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పేరుతో రుణమాఫీ సొమ్మును క్రమ తప్పకుండా అక్కచెల్లెళ్ల ఖాతాల్లో జమ చేశారు. ఏటా రూ.18,500 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.74 వేలు నా ఖాతాలో రుణమాఫీ సొమ్ము జమ అయ్యింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా రుణపడి ఉంటాం.

– పెదవేగి దుర్గ, గజ్జరం, తాళ్లపూడి మండలం

మాట నిలుపుకొన్నారు .. సంతోషం



డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి గతంలో చంద్రబాబు మహిళలను మోసగించారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో రుణాలను మాఫీ చేయడం ఆనందదాయకం. ఏడాదికి రూ.18,747 చొప్పున నాలుగేళ్లలో నాకు రూ.74,991 రుణం మాఫీ అయ్యింది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సొమ్ము నేరుగా మహిళల ఖాతాల్లోనే జమ చేశారు.

– కొండ్రపు సత్య దుర్గాభవాని, ఇందిరా ప్రియదర్శిని గ్రూపు, కొవ్వూరు

హైవేను పరిశీలించిన అధికారులు



దొండపూడిలో ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్

గోపాలపురం: కొవ్వూరు నుంచి జీలుగుమిల్లి వరకూ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలోని దొండపూడి వద్ద రహదారి విస్తరణకు అవసరమైన స్థలాన్ని బుధవారం జిల్లా సబ్ కలెక్టర్ అసితోష్ శ్రీవాస్తవ్, ట్రైనీ కలెక్టర్ కె.యశ్వంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. దొండపూడి కూడలిలో ఈ రోడ్ల విస్తరణను తొలుత ప్రతిపాదించిన 23 వెడల్పుకు బదులుగా 18 మీటర్లకు కుదించాలంటూ పలువురు గ్రామస్తులు ఇటీవల రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనితకు వినతి పత్రాలు అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్‌లు బుధవారం దొండపూడి వచ్చి పరిశీలించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు రహదారిని ఇరువైపులా జాతీయ రహదారి సర్వేయర్, మండల సర్వేయర్లతో సర్వే జరిపించారు. అలాగే 23 మీటర్ల రోడ్డు వెడల్పు వల్ల కలిగే నష్టాలు, 18 మీటర్లకు కుదించడం వల్ల కలిగే ప్రయోజనాలను అంచనా వేసి రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని గోపాలపురం తహసీల్దార్ వనజాక్షిని ఆదేశించారు.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఇంటి వద్దకే వెళ్ల ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న కౌన్సిలర్ మొదలవలస నాగమణి, వలంటీర్లు

నిడదవోలు: పట్టణంలోని 15వ వార్డులో బుధవారం ఇంటింటికీ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకూ దేశంలో ఎక్కడైనా చికిత్సలు పొందే వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. దీంతో నూతనంగా ముద్రించిన కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గతంలో లబ్ధిదారులకు అందించారు. అయితే ఆ సమయంలో కార్డులు పొందలేని వారికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మొదలవలస నాగమణి వలంటీర్లు, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. వలంటీర్లు మహాలక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.

కొవ్వాడ కాలువ పూడిక తీయించాలి

- పెద్దేవంలో సబ్ స్టేషన్ నిర్మాణం మొదలుపెట్టాలి
- అసెంబ్లీలో పలు సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: కొవ్వాడ కాలువ వరద ముంపు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పూడిక తీతకు టెండర్లు పిలిచి ఈ వేసవిలో పనులు పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ కాలువ ముంపు వల్ల నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల రైతులకు ఏటా రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల పంట నష్ట పరిహారంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. అందుచేత ప్రభుత్వం ఈ కాలువ పూడిక తీతకు చర్యలు తీసు కోవాలని కోరారు. విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైన తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో త్వరితగతిన పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వివాహ శుభకార్యాలకు వీలుగా ప్రతి మండలంలోనూ ఎస్సీ ఏరియాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థల సేకరణ ఇప్పటికే పూర్తయ్యిందన్నారు. భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.30 కోట్లలో కొంత మొత్తాన్ని విడుదల చేసి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరి వరద కోత వల్ల కొవ్వూరు మండలం మద్దూరులంకలో ఇప్పటికే 400 ఎకరాల భూమి కోతకు గురైందన్నారు. మరింతగా కోతకు గురవకుండా ఈ గ్రామం చుట్టూ రివిట్‌మెంట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వాడపల్లి గ్రామస్తులకు 18, 20 కిలోమీటర్లు దూరంలో ఇళ్ల స్థలాలు కేటాయించారని ఎమ్మెల్యే తలారి అన్నారు. అంత దూరం వెళ్లేందుకు లబ్ధిదారులు సుముఖంగా లేనందున స్థానికంగా ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. కొవ్వూరు ప్రాంత మత్స్యకారులు చేపల వేటకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వారు పోలవరం ప్రాజెక్టు వద్ద చేపలవేటకు వెళితే అటవీ శాఖ ఇబ్బందులు పెడుతున్నట్టు మత్స్యకారులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యే తలారి అసెంబ్లీలో కోరారు.

సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా



శిబిరంతో మందులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ, వారికి ఆరోగ్య భరోసా కల్పిస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం పట్టణంలోని బ్రాహ్మిణ్ స్ట్రీట్ సచివాలయంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన చైర్మన్ ఆదినారాయణ రోగులకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అవసరమైన రోగులకు ఆయన ఉచితంగా మందుల కిట్లు పంపిణీ చేశారు. నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ. తేజశ్రీ నేతృత్వంలో వైద్య నిపుణుల బృందం 422 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వారిలో పురుషులు 181మంది, మహిళలు 241 మంది, విద్యార్థులు ఐదుగురు, గర్భిణులు నలుగురు. అలాగే ఈ శిబిరంలో 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి ఈ. తేజశ్రీ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆవుదూడకు ఊయలోత్సవం



ఆవుదూడకు ఊయలోత్సవం నిర్వహిస్తున్న యజమాని కుటుంబం

పెరవలి: పుట్టిన బిడ్డకు బారసాల చేయడం ప్రతి ఇంటా ఆనవాయితీ. కానీ అదే ఇంటిలో తిరుగుతున్న గోమాతకు దూడ పుడితే బిడ్డను సాకినట్టే ఆ కుటుంబం 21 రోజున ఊయలోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన అఖండ వేంకటేశ్వరరావు అనే రైతుకు కపిల జాతికి చెందిన ఆవు ఉంది. ఆ గోమాతకు గత నెలలో ఒక దూడ పుట్టింది. ఆ దూడకు 21 రోజైన బుధవారం బాలసాల నిర్వహించి శాస్త్రబద్ధంగా ఊయలోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకను చూసేందుకు చుట్టుపక్కల వారు భారీగా తరలి వచ్చారు.

'ఉపాధి' పనులపై ఎంపీడీవో సమీక్ష



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బుజ్జి

చాగల్లు: మండలంలోని ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీఓ నాతి బుజ్జి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ ఆర్థిక సంవత్సరపు లేబర్ బడ్జెట్ పూర్తి చేయాలని, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో వివిధ గ్రామాల్లో చేపట్టే కొత్త ఉపాధి పనులకు అంచనాలు రూపొందించి, వాటికి ఆమోదం పొందాల్సిందిగా ఆదేశించారు. సమావేశంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లల్లో రక్త హీనతను పారదోలదాం



నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారికి ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

నల్లజర్ల: ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమం అమలుపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష జరిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతకు ప్రధాన కారణమైన నులిపురుగుల నివారణకు వైద్య,ఆరోగ్యశాఖ అంకితభావంతో పనిచేయాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తెల్లం గంగాధర రావు మాట్లాడుతూ ఈ నెల 9న అన్ని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో 19 ఏళ్ల లోపు విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, సూపర్‌వైజర్లు అన్నమ్మ, సత్యనారాయణ, ఆరోగ్య సహాయకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో పోస్టర్ అవిష్కరణ

చాగల్లు: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్టు బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.నిశిత తెలిపారు. ఈ నెల 9న శుక్రవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో బుధవారం ప్రచార పోస్టర్‌ను డాక్టర్ నిశిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్రరావు, రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియాతో నత్రజని లభ్యత అధికం

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- నందమూరు రోడ్డులో ప్రయోగాత్మకంగా పిచికారీ



నానో యూరియా పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు

కొవ్వూరు: వరి పైరుపై నానో యూరియా (ద్రవరూప ఎరువు) పనితీరు ఎలా ఉంటుందో బుధవారం స్థానిక నందమూరు రోడ్డులోని పొలాల్లో జిల్లా వ్యవసాయ అధికారి కె.మాధవ రావు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. వంకా వెంకట్రావు అనే రైతుకు చెందిన ఎకరం పొలంలో యూరియాను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాధవరావు మాట్లాడుతూ ఒక బాటిల్ నానో యూరియా (500 మిల్లీ లీటర్లు) ఒక బస్తా (45 కిలోల) సాధారణ యూరియాను సమర్థవంతంగా భర్తీ చేస్తుందన్నారు. సంప్రదాయ యూరియాలో ఉండే నత్రజని కేవలం 25 నుంచి 30 శాతం మాత్రమే మొక్కకు అందుబాటులో ఉండి మిగిలినది వివిధ రూపాల్లో వ్యర్థం అవుతోందన్నారు.అయితే నానో యూరియా మాత్రం పిచికారీ చేసిన ఇరవై నుంచి యాభై నిమిషాల్లోనే పంటకు నత్రజని లభ్యతను 80 శాతం పెంచుతుందన్నారు. సాధారణ యూరియా బస్తా ధర రూ.266, ఉంటే దానికి సమానమైన నానో యూరియా 500 మిల్లీ లీటర్లు కేవలం రూ.225 కే లభిస్తోందన్నారు. నానో యూరియా లీటర్ నీటికి 4 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. ఏడీఏ కె.చంద్రశేఖర్, ఏవో ఎ.గంగాధర్, ఎంపీఈవో ఎ.నవీన్, సురేష్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ వైవీఎస్ ఆచారి బుధవారం పరిశీలించారు. బందపురం, దుద్దుకూరు, గౌరీపట్నం, యాదవోలు, చిన్నాయగూడెం, సంగాయగూడెం, యర్నగూడెం, కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఉండవలసిన వసతుల గురించి వీఆర్వోలు, బీఎల్వోలు, ఉపాధ్యాయులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన సూచనలు ఇచ్చారు. ఆర్ఐ డి.వెంకటేష్ తహసీల్దార్ వెంట ఉన్నారు.

విద్యార్థులకు దంత వైద్య శిబిరం

కంబాలచెరువు: గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో శ్రీవాణి దంత వైద్యశాల సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ స్టూడెంట్స్‌కి దంత వైద్యులు అవగాహన కల్పించారు.

డ్రగ్ లైసెన్స్‌లు తనిఖీ చేసిన అధికారులు



కొవ్వూరులో డ్రగ్ లైసెన్స్‌లు తనిఖీ చేస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ అధికారి నాగమణి

కొవ్వూరు: డివిజన్ పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకుల ఫార్మసిస్టు లైసెన్స్‌ల రెన్యువల్స్, ఫిజికల్ వెరిఫికేషన్ బుధవారం జరిగింది. జిల్లా ఔషధ నియంత్రణాధికారి (అసిస్టెంట్ డైరెక్టర్) డి.నాగమణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. జయలక్ష్మి స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ నాగమణి మాట్లాడుతూ జిల్లాలోని మెడికల్ షాపుల నిర్వాహకులు తమ డ్రగ్ లైసెన్సులను విధిగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్ గడువు పూర్తయిన వెంటనే నవీకరణ చేయించుకోవాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో సుమారు 600 మెడికల్ షాపులు ఉన్నాయన్నాయని చెప్పారు. పెరవలి, ఉండ్రాజవరం, నల్లజర్ల, తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి మండలాలకు ఉదయం పూట, కొవ్వూరు, నిడదవోలు, చాగల్లు, రాజమహేంద్రవరం నగర పరిధిలోని మల్లయ్య పేట, టి.నగర్, బాలాజీపేట, ఐఎల్‌టీడీ, ఆల్‌కట్ గార్డెన్స్ ప్రాంతాల వారి డ్రగ్ లైసెన్స్‌లను బుధవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. గడువు ముగిసిన పలువురి సర్టిఫికెట్స్‌ను రెన్యువల్ చేశారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు మద్దుల సోమరాజు, కోట్ల వీర్రాఘవులు, పోకల మధు, ఎండీ హుస్సేన్, మానేపల్లి రమేష్ తదితరులతో పాటు ఇతర సభ్యులు సహకారం అందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లోనే..

భద్రతా వారోత్సవాల్లో కొవ్వూరు ఎంవీఐ శ్రీనివాస్ నాయక్



మాట్లాడుతున్న కొవ్వూరు ఎంవీఐ శ్రీనివాస్ నాయక్

నిడదవోలు: రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లోనే ఉందని, ప్రతి వాహనదారుడూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని కొవ్వూరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ఎస్.శ్రీనివాస్ నాయక్ అన్నారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాలను బుధవారం పట్టణంలోని సత్యనారాయణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరినపుడు ఎలా స్పందించాలో వివరించారు. నిబంధనల ప్రకారం డ్రైవర్లు విధిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపేటపుడు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సహాయక బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జమీర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మద్దూకూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వడ్డి శ్రీనివాస్, యూనియన్ కార్యవర్గ సభ్యులు, టాక్సీస్టాండ్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.